క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకారంలో తిరుపతి గంగమ్మ

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో తిరుపతి గంగమ్మ ఆలయం నిర్మించి మండలం రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి, అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. మొక్కులు చెల్లించారు.

పుష్కరిణిలో పూడికతీత


ఆలయం వద్ద పూడికతీత, కంచె ఏర్పాటు పనులు

చౌడేపల్లె: మండలంలో చారాల సమీపంలోని శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని పురాతన పుష్కరిణిలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. దశాబ్దాల చరిత్ర ఉన్న పుష్కరిణిలో గ్రామస్తుల చొరవతో ఈ పనులకు ఉపక్రమించారు. కొన్నేళ్ల కాలంలో 12 మంది పుష్కరిణిలో ప్రమాదవశాత్తు జారిపడి మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలు తలెత్తకుండా గ్రామస్తులు, వివాహాలు అయి అత్తారింటికి వెళ్లిన చారాల గ్రామ ఆడబిడ్డలు సైతం ఆర్థికంగా చేయూతనిచ్చారు. సుమారు రూ.10 లక్షలతో పూడికతీత, చుట్టూ కంచె నిర్మాణం, కోనేరు ఆధునీకరణ పనులు చేస్తున్నారు.

22న శ్రీహనుమాన్ జయంతి


శ్రీహనుమాన్ జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

పుంగనూరు: మండలంలో తోపుమఠం బాల గురవయ్యగారిపల్లె రోడ్డులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న శ్రీహనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించి మంగళవారం మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. జయంతి రోజున అభిషేకాలు, పూజలు, శ్రీసీతారాముల కళ్యాణం, భక్తులకు అన్నదానం..ఇత్యాది కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో త్రివిక్రమ్, సురేష్ బట్టర్, శ్రీధర్ బట్టర్, భాస్కర్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, గజపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని జాండ్రపేటలో 'కిశోరి వికాసం'పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. బాల్య వివాహాలతో శారీరక, మానసికంగా సమస్యలు ఉత్పన్నమవుతాయని, నిర్దేశించిన వయస్సు వచ్చిన పిదపే వివాహాలు చేసుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని మహిళా పోలీస్ ఆసియా చెప్పారు.


మొరవ పారుతున్న నక్కపల్లె చెరువు


ప్రవహిస్తున్న ఎరిగేనేరు


గొల్లపల్లె వద్ద ప్రవహిస్తున్న బూదాల వంక

చెరువులు.. మొరవలు

- ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- వైఎస్సార్ జలాశయంలోకి చేరుతున్న నీరు
- ప్రాజెక్టు నిండితే పట్టణానికి నీటి సమస్య తీరినట్టే!

పలమనేరు: కొన్నిరోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు మొరవెత్తుతున్నాయి. వాగులు, వంకలు పారుతున్నాయి. ఇక కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కౌండిన్య నదికి నీరు చేరుతోంది. ఇప్పటికే మండలంలోని కాలువపల్లె వద్ద వైఎస్సార్ జలాశయం సగానికి పైగా నిండింది.

పలు చెరువులు మొరవ

మండలంలోని బొమ్మిదొడ్డి, నక్కపల్లె, బేలుపల్లె, ఎస్‌పురంలోని వడ్డివానికుంట, గొల్లపల్లి బుచ్చిరెడ్డి చెరువు, ఎర్రగొండేపల్లె వస్తింపల్లె చెరువు, గంగారపూర్ చిన్నచెరువు మొదలైనవి ఈ వర్షాలకు మొరవెత్తుతున్నాయి. కొలమాసనపల్లె, మొరం, కరిడిమొడుగు తదితర చెరువులకు వరదనీరు చేరుతోంది. ఇక మండలంలోని బూదాలవంక, చిన్నేరు, ఎరిగనేరు, కాలువపల్లె ఏర్లలో నీరు ప్రవహిస్తోంది.


నక్కపల్లె చెరువుకింద జలమైన పంటపొలాలు

వానొస్తే వీధి చెరువే..!


గాంధీ వీధిలో వర్షానికి నిలిచి ఉన్న నీరు

చౌడేపల్లె: కొద్దిపాటి వర్షానికి స్థానిక గాంధీవీధి చెరువును తలపిస్తోంది. మంగళవారం గాంధీ విగ్రహం వర్షానికి నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలువ నిర్మాణం పనులకు పూనుకున్నారు. ఇక్కడ వర్షపు నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కౌండిన్యలో మొదలైన ప్రవాహం

మండలంలో ప్రధాన నదిగా పేరున్న కౌండిన్యలోకి ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు చేరుతోంది. స్థానికంగా ఉన్న వాగులు ప్రవహించి వరదనీరు చేరుతోంది. దీంతో వైఎస్సార్ జలాశయం జలకళ సంతరించుకుంటోంది. పట్టణానికి ప్రధాన నీటి ఆధారమైన ఈ జలాశం పూర్తిగా నిండితే పట్టణంలో నీటి సమస్య తప్పినట్టే.

నోటీస్ బోర్డు

- 24న శనేశ్వరస్వామి జయంతి

పుంగనూరు: పట్టణ సమీపంలోని యాబైరాళ్ల మొరవ వద్ద ఉన్న శనేశ్వరస్వామి ఆలయం, అలాగే రాగానిపల్లె రోడ్డులోని శనేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24న శనేశ్వరస్వామి జయంతి నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఆరోజున ప్రత్యేక తైలాభిషేకం, నువ్వులు, నూనెతో అమృతాభిషేకాలు చేస్తామని, పూజా కార్యక్రమాలు నిర్వహించే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఊరూరా జాతర

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టులో మంగళవారం గంగజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం తొలిపూజ చేసి వంశపారంపర్య ధర్మకర్త జగదీశ్వర్‌రెడ్డి, హరిత రెడ్డి కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గజమాల సమర్పించి హారతులు పట్టారు. సాయంత్రం కుంభ సమర్పణ చేశారు. రాత్రి వీధినాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ జాతరలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొలువుదీరిన గంగమ్మ తల్లి

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లెలో మంగళవారం నడివీధి గంగమ్మ కొలువుదీరారు. అమ్మవారి గరిగను ఊరేగించారు. గంగమ్మ తల్లికి ఉదయం అంబలి పోశారు. సాయంత్రం అమ్మ వారికి పొంగలి పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రిలో పిండి వంటలతో మొక్కులు తీర్చుకొన్నారు. అలాగే జొన్నగురకలలో మంగళవారం గంగమ్మకు భక్తితో అంబలి పోశారు. అనంతరం భక్తిప్రపత్తులతో భక్తులు పొంగళ్లు పెట్టారు. అమ్మ వారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

వైభవంగా పట్టాభిషేకం

- ముగిసిన మహాభారత మహోత్సవాలు

గుడుపల్లె: మండలంలో యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపదీ ధర్మరాజస్వామి ఆలయంలో 18 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. మహా భారతంలో కౌరవులు, పాండవుల జననం నుంచి మరణం వరకు మహా భారత ఘట్టం పూర్తి చేశారు. చివరి రోజున శ్రీ ధర్మరాజస్వామి పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ ఆవరణలో వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో పోతులరాజు పూర్వజన్మ వృత్తాంతాన్ని హరికథాగానం చేశారు. ద్రౌపదీ అమ్మవారిని పుర వీధులలో ఊరేగించారు. ప్రతి ఇంటా పూజలు చేశారు. ఊరేగింపు అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రతి అడుగుకూ నిమ్మకాయలు పెట్టి అమ్మవారి ప్రదక్షిణలు చేశారు. ద్రౌపదీ అమ్మవారిని ఆలయంలో ఉంచారు. ఆ తర్వాత గ్రామ మహిళలు ఆలయం ఆవరణలో పొంగళ్లు పెట్టి, దీపారాధన చేశారు. మహా భారత మహోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ధర్మరాజస్వామి మూల విగ్రహం ఏర్పాటు చేసిన కడవపై నిలబెట్టిన కత్తిని తొలగించారు. దీంతో మహా భారత మహోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.



పట్టాభిషేకానికి ముస్తాబైన ధర్మరాజస్వామి, ద్రౌపదమ్మ

గోడలకు పగుళ్లు..!

- ప్రమాదాలకు తావిస్తుందనే ఆందోళన



తహసీల్దార్ కార్యాలయ భవనం


భవనం చుట్టూ గోడల పగుళ్లకు కూలిన గోడ

గంగవరం: తహసీల్దార్ కార్యాలయ భవనం గోడలు పగుళ్లు బారడంతో ప్రమాదాలకు తావిచ్చేలా ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సిమెంట్ గోడలతోపాటు భవనం మోల్డింగ్ కప్పు పెచ్చులూడుతున్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి భవనం నిర్మించడంతో ఈ దుస్థితి ప్రాప్తించిందనే ఆరోపణలు వస్తున్నాయి. భవనం ముందు భాగం పైకప్పు, మెట్లు అనుకుని నిర్మించిన గోడలోని సిమెంట్ దిబ్బెలు పగిలి నేలరాలాయి. రోజూ వందల సంఖ్యలో ప్రజలు వివిధ సమస్యలు నివేదించేందుకు వస్తుంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం గోడలు చెమ్మగిల్లాయి. దీంతో మరింత పగుళ్లు బారిన పడే పరిస్థితి నెలకొంది. ప్రమాదం చోటుచేసుకోక మునుపే మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో మంగళవారం విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీ చేశారు. స్థానిక బిస్మిల్లా ట్రేడర్స్‌లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత దుకాణ యజమాని ప్రభుత్వ అనుమతులు పొందకుండా, సరైన ఇన్వాయిస్‌లు లేకుండా, రైతులు తీసుకున్న ఎరువుల బస్తాలకు రసీదులు ఇవ్వడంలేదని తేల్చారు. దుకాణంలో ఎరువుల విక్రయాలకు సంబంధించి రికార్డులు సైతం సక్రమంగా నిర్వహించలేదని అధికారులు గుర్తించా రు. అధికారులు మాట్లాడుతూ, దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో పాటు అనధికారంగా నిల్వ ఉంచిన 200 బస్తాల ఎరువులను సీజ్ చేశామన్నారు. ఎరువుల బస్తాల విలువ రూ.1.35 లక్షలు ఉంటుందన్నారు. దుకాణం లైసెన్స్‌ను రద్దు చేసేందుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారి రామాంజనేయరెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణ, ఏఓ చిట్టిబాబు పాల్గొన్నారు.

శ్మశానదారి ఆక్రమణపై గొడవ

ఫిర్యాదుదారుడిపై రైతులు కుటుంబం దాడి

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు పంచాయతీ తావడపల్లె చెరువు శ్మశాన దారిని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించాడని గ్రామస్తుడు గుణశేఖర్ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై వీఆర్వో, సర్వేయర్ సర్వే నిమిత్తం మంగళవారం అక్కడికి వెళ్లారు. వారి కళ్లెదుటే గుణశేఖర్‌పై రైతు నారాయణ కుటుంబీకులు దాడి చేశారు. ఇద్దరూ అధికారపార్టీకి చెందిన వారే కావడంతో రెవెన్యూ ఉద్యోగులు ప్రేక్షకపాత్ర వహించారు. ఇది చర్చనీయాంశమైంది.

ఉద్యోగ విరమణ సత్కారం

గంగవరం: ఉద్యోగ విరమణ పొందిన ఫార్మా అసిస్టెంట్ రాజశేఖర్‌కు గంగవరం పీహెచ్‌సీ వద్ద వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు సత్కారం చేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. తీర్థంలో మంగళవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై పాటించాలని, గర్భవతులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రుల్లోనే కాన్పులు శ్రేయస్కరన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శాంతమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీపీ

- యంత్రాలతో ఉపాధి పనులు
- రూ.6 కోట్లు దుర్వినియోగం
- మండల సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యుల ఆరోపణ



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: మండల స్థాయి అధికారులు అవినీతికి పాల్పడకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీ మాట్లాడారు. తొలుత పలు సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారని సర్పంచ్ రాజప్ప ఆరోపించారు. కూలీలకు పనులు కల్పించకుండా యంత్రాలతో పనులు చేయడం, గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడంతో మండలంలో సుమారుగా రూ.6 కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. ఉపాధి పనుల వివరాలను సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసి పనులు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న ఏఎల్ఎంలు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పూర్తిగా అంధకారం నెలకొందని సర్పంచ్ వెంకటేష్ మండిపడ్డారు. మండలంలోని పలు మహిళా గ్రూపుల్లో అవకతవకలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, ఏపీఎం అవినీతికి పాల్పడటంతోనే గ్రూపు సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ రైతులకు 2030 బస్తాల వేరుశనగ విత్తనాలకు గాను 1313 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, గ్రూపు సభ్యుల రైతులకు డ్రోన్ కొనుగోలు చేసుకునేందుకు 80 శాతం రాయితీ ఉందని వ్యవసాయ శాఖాధికారిణి గీతాకుమారి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ కేశవులు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, డీటీ కిశోర్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న అరబిందో సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విధుల్లో నుంచి తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి నిధులు అడుగుదాం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు తీసుకురావాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు అన్నారు. ఈ నెలతో నిర్వహించనున్న టీడీపీ మహానాడులో దీనిపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. చిత్తూరులో రోడ్ల అభివృద్ధి, విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల తోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్,సీకేబాబు హేమలత పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన వజ్రాలపురం బోయకొండ


వజ్రాలపురం బోయకొండ గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్త జనులతో పోటెత్తింది. అమ్మవారి జాతరలో భాగంగా రెండో రోజు గంగమ్మ భక్తులకు నిజరూప దర్శనంతో కనువిందు చేశారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంక రించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ అమ్మ వారికి కాణిపాకం దేవాలయం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పరిసర గ్రామస్తులతోపాటుగా కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఈశ్వర్‌నాయుడు, మమత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కార్యనిర్వాహకులు గోపి పురుషోత్తం, కమిటీ సభ్యులు శివలింగయ్య, బుస్సానాగరాజగౌడ్, రాజేంద్రనాయుడు, రామ్మూర్తినాయుడు, సుబ్బానాయుడు, బుజ్జి, శంకరయ్య, మురళి, తులసీ. వేణుగోపాల్‌నాయుడు, ఆలయ మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మజాతర మొదలైంది. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి బుధవారం వేకువ జామున నడివేధిలో కొలువుదీర్చనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పాలేరులో...

మండలంలోని పాలేరు గ్రామంలో సోమవారం రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామంలో ఊరేగించి తెల్లవారు జామున నడివీధిలో కొలువుదీర్చిన అమ్మవారికి ప్రత్యే క పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి దర్శించుకున్నారు. తుంబకుప్పంలో జాతర వేడుకగా నిర్వహించారు.


పాలేరులో కొలువు దీరిన గంగమ్మ

ఆడపిల్లలపై లింగ వివక్ష వద్దు

తవణంపల్లె: ఆడపిల్లలపై లింగ వివక్ష చూపరాదని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. దిగువ తడకర, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆడపిల్లల లింగ వివక్ష, అసమానతలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడారు. లింగ వివక్ష, భ్రూణ హత్యలు, అసమానత, అక్షరాస్యత రేట్లు, ఆరోగ్య, లింగ అసమానతలను వివరించారు.